క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మ తల్లి పండగ



అమ్మవారికి నైవేద్యంగా గుడ్లు సమర్పిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు శీలానగర్‌లో కొలువైన సత్తెమ్మతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని సత్తెమ్మకు ప్రీతిపాత్రమైన గుడ్లను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో జగ్గయ్యపాలెం, గవరజగ్గయ్యపాలెం, శీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా పాల్గొన్నారు.

ప్రతిభకు పదును



క్రాఫ్ట్స్ చేస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనకు పదును పెడుతున్నామని, అందులో భాగంగా వారితో క్రాఫ్ట్స్ చేయించామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించారు. విద్యార్థులకు కలర్స్, పేపర్స్ అందజేసి అందమైన ఆకృతులు రూపుదిద్దేలా శిక్షణ ఇచ్చారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ఎనలేనివి



మినరల్ వాటర్‌పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్పీఎఫ్ సీఐ వెంకటరమణ

అగనంపూడి: స్వచ్ఛంద సంస్థలు సేవలు నిరుపమానమని దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ అన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో దువ్వాడ స్టేషన్ ఆవరణలోమధ్యాహ్నం వేళ రైళ్లలోని జనరల్ బోగీల ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల నాయకులు కంచుమూర్తి ఈశ్వర్, ఎం.ఎస్.ఎన్.మూర్తి, భాస్కరరాజు, సత్యనారాయణ, సత్యవతి, సాయిరామ్‌రాజు, ఆదిత్య రాజు పాల్గొన్నారు.

తిరుమలేశునికి విశేష అలంకరణ



విశేష అలంకరణలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి శనివారం అర్ధరాత్రి వరకు సహస్రనామార్చనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుడిని విశేష పుష్పాలతో అలంకరించారు. ఆదివారం భక్తులకు విశేష అలంకరణలో ఉన్న స్వామి దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

గురుకుల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ

సీతంపేట: ఆంగ్ల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించే దిశగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శంకరమఠం రోడ్డులోని ఒక హోటల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డీసీవో డాక్టర్ సి.ప్రభావతమ్మ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ బోధనా సామర్థ్యం మెరుగుపర్చడానికి ముంబైకి చెందిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్టు తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఫ్యూచర్ రెడీనెస్ అంశంపై మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గురుకుల ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, కోటక్ ఫౌండేషన్ ప్రతినిధులు నూతన్, పర్జిత్ పంతక్, జ్యోతి శిక్షణ ఇచ్చారు.

అన్నదాత సుఖీభవ

హరేకృష్ణ మూమెంట్, టచ్ స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో రోజూ 500 మందికి మధ్యాహ్న భోజనం

దాతల సహకారం... సహాయకులకు 'సుభోజనం'

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహణ



సుభోజనం చేస్తున్న రోగుల సహాయకులు



పిండి, పప్పులు ఆడుతున్న యంత్రాలు

అది నగరానికి శివారు.. రవాణా సదుపాయం కూడా అంతంత మాత్రమే.. అలాంటి ప్రాంతంలో క్యాన్సర్ రోగుల పాలిట వరప్రదాయిని అయిన హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఉంది. ఇక్కడికి వైద్యం కోసం ఎక్కడెక్కడి నుంచో వస్తారు. అయితే చుట్టు పక్కల సదుపాయాలు అంతంతమాత్రమే. అలాంటి చోట దాతల సహకారంతో హరేకృష్ణమూమెంట్, టచ్‌స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో సుభోజనం అందించి రోగులతో పాటు సహాయకుల ఆకలితీర్చుతున్నారు. దీంతో వారు అన్నదాత సుఖీభవ అని ఆశీర్వదిస్తున్నారు. – అగనంపూడి





సుభోజనం వడ్డిస్తున్న చారిటీస్ ప్రతినిధులు, దాతలు, ఆస్పత్రి డైరెక్టర్

రెండేళ్ల కిందట అగనంపూడిలోని హోమీబాబా (టాటా) క్యాన్సర్ ఆస్పత్రిలో సుభోజన కార్యక్రమం ప్రారంభించింది. దాతల సహాయ సహకారాలతో నిరాటంకంగా సుభోజన కార్యక్రమాన్ని రోజూ 500 మందికి అందిస్తూ రోగులు, వారి బంధువుల మన్ననలు పొందుతున్నారు. హరేకృష్ణ మూమెంట్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీల భక్తివేదాంత స్వామి ప్రభు పాదుల ఆశీస్సులతో సంస్థ అధ్యక్షుడు శ్రీమాన్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో 2023 జూన్ నుంచి సుభోజన (మధ్యాహ్న భోజనం) కార్యక్రమం ప్రారంభించారు. గతేడాది ఆరు మాసాల పాటు కృష్ణా జిల్లాకు చెందిన కోసూరు అంకినీడు ప్రసాద్ సుభోజనం అందివ్వగా, ఈనెల నుంచి మరో ఏడాది పాటు అంకినీడు ప్రసాద్ వారి పూర్వీకుల పేరుతో సుభోజనం కొనసాగించడానికి అయ్యే వ్యయాన్ని సంస్థకు అందించారు. దీనికి గానూ రూ.37 లక్షలు అంకినీడు సంస్థకు జమ చేశారు.

ఆస్పత్రికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా అధిక శాతం మంది ఒడిశా, తెలంగాణా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి రోగులు వస్తున్నారు. ఆస్పత్రికి సమీపంలో భోజనశాలలు అందుబాటులో లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సహాయకులు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో కార్యక్రమం కొనసాగిస్తున్నామని సుభోజన సమన్వయకర్త పిల్లల షణ్ముఖరావు తెలిపారు. కుటుంబ సభ్యుల పేరుతో దాతలు ఒక్క రోజు సుభోజనం అందించొచ్చని ఆయన తెలిపారు. రోజుకు రూ.12వేలతో 500 మంది నిరుపేద రోగుల సహాయకుల ఆకలి తీర్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

రుణపడి ఉంటాం



మాకు అందుబాటులో క్యాన్సర్ వైద్యం లేదు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చి ఉంటున్నాం. వచ్చిన ప్రతీసారి 15రోజుల పాటు ఇక్కడే ఉంటున్నాం. ఇద్దరం ఇక్కడే సుభోజనం తింటున్నాం. సమీపంలో హోటళ్లు లేవు. మానవతామూర్తుల సహకారంతో సుభోజనం అందిస్తున్న సంస్థకు రుణపడి ఉంటాం.

– లక్ష్మీకుమారి, పామర్రు, కృష్ణా జిల్లా

చాలా రుచిగా ఉంది



సుభోజనం చాలా రుచిగా ఉంది. మా అమ్మగారికి ఆరోగ్యం బాగోలేక తుని నుంచి వస్తున్నాం. వచ్చిన ప్రతీసారి ఇక్కడే సుభోజనం తింటున్నాం. దగ్గర్లో భోజన వసతి లేని పరిస్థితుల్లో దాతల సహకారంతో హరేకృష్ణ మూమెంట్ నిర్వాహకులు ముందుకు రావడం సంతోషంగా ఉంది. భోజనం కోసం ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది.

– నాగమణి, తుని

ఇది కదా నిజమైన సేవ...



ఇదే కదా నిజమైన సేవ. రోగులను తీసుకొని వచ్చే సహాయకుల బాధలు వర్ణనాతీతం. రోగుల పరిస్థితిని అనుసరించి ఎన్నో బాధలు, ఇబ్బందులతో వచ్చే వారికి భోజన సమయానికి పట్టెడన్నం పెట్టడం మహదానందంగా ఉంటుంది. క్యాన్సర్ బాధితులతో వచ్చే వారికి ఇదో వరం.

– సన్యాసమ్మ, పలాస

దాతలకు ధన్యవాదాలు



సుభోజ కార్యక్రమంలో భాగస్వాములైన దయార్ద్ర హృదయులందరికీ ధన్యవాదాలు. మహత్తర కార్యక్రమంలో మేం సైతం అంటూ ముందుకు వచ్చే దాతలకు సంస్థ కృతజ్ఞతలు తెలుపుతుంది. విశాఖ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుభోజనం విస్తరించాలనే ఆలోచనలో ఉన్నాం. దాతలు ముందుకు వస్తే త్వరలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుభోజనం అందిస్తాం.

– నిష్కించిన భక్తదాస, హరేకృష్ణ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు

ఆకలి తీర్చడం అదృష్టం



క్యాన్సర్ బాధితులతో వచ్చే సహాయకులు ఓ పక్క బాధ, మరో పక్క సమయానికి భోజనం దొరకని పరిస్థితుల్లో ఉంటారు. వారి ఆకలి తీర్చే భాగ్యం మాకు కలగడం అదృష్టంగా భావిస్తున్నాం. హరేకృష్ణ మూమెంట్, టచ్‌స్టోన్ చారిటీస్‌తో భాగస్వాములుగా చేరడం సంతోషంగా ఉంది. మా పూర్వీకుల పేరుతో గతంలో ఆరు మాసాల పాటు కార్యక్రమం చేపట్టాం. మరో ఏడాదికి అయ్యే వ్యయాన్ని కూడా సంస్థకు అందించాం.

– కోసూరు అంకినీడు ప్రసాద్, హైదరాబాద్

చెత్త తొలగించరూ!



చిన నడుపూరు వుడా కాలనీ రోడ్డులో చెత్తాచెదారం



సీతానగరం ఆలయం వద్ద..

పెదగంట్యాడ: మండలంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఏ రోజుకు ఆ రోజు చెత్త తొలగించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేవారు. ఆ చెత్తను నేరుగా డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఇళ్లలోని చెత్తను రోడ్లపై విచ్చలవిడిగా పడేస్తున్నారు. అక్కడ పందులు చేరి చిందరవందర చేస్తున్నాయి. దీని కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి నెలకొందని, ఇప్పటికైనా స్పందించి చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉక్కుపరిరక్షణకు ఐక్య ఉద్యమాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ఐక్య ఉద్యమాలు అవసరమని కార్పొరేటర్ గంగారావు అన్నారు. సీపీఎం స్టీల్ డివిజన్, స్టీల్ సీఐటీయు, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ ప్లాంట్‌లో కార్మికులు సంతోషంగా పని చేయాలంటే ఇంటి వద్ద భార్య, పిల్లు సంతోషంగా ఉండాలన్నారు. అలా ఉండాలంటే మహిళలు, పిల్లలు ఆట,పాటలతో సంతోషంగా గడపాలన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఎదుర్కొవాలంటే మహిళలు ఉద్యమంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ కె. విమల మాట్లాడుతూ మహిళలు మద్దతుతోనే ఏ ఉద్యమమైనా విజయవంతం అవుతుందన్నారు. దాని కోసం మనం అందరం కార్మికులతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గుర్రం రమణ, ఐద్వా నాయకులు కె. వేణు, ఎం.వి.ఎస్. మూర్తి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి చేయూత



మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి సరకులు అంచేస్తున్నచింతలపూడి

కూర్మన్నపాలెం: ఇటీవల మరణించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబాన్ని ఆ పార్టీ 87వ వార్డు నాయకులు ఆర్థికంగా ఆదుకున్నారు. దీనిలో భాగంగావార్డులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మృతుడి భార్యకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు.రజకవీధిలో నివాసముంటున్న శివ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇటీవల మృతి చెందాడు.దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండంతో సీనియర్ నాయకుడు ఇల్లపు రాము సమకూర్చిన వస్తువులను మాజీ ఎమ్మెల్యే చింతపూడి వెంకటరామయ్య అందజేశారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ప్రగడ వేణుబాబు, దుగ్గపు దానప్పలు, ఆనంద్ , రామలక్ష్మి , దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి

డాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. చెన్నైలోని సామ్‌సంగ్ కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకున్నాయన్నారు. లేబర్‌కోడ్ అమల్లోకి వస్తే కార్మికులు ఏ కష్టం వచ్చినా సమస్య పరిష్కారానికి సమ్మె చేయలేరని, అలా చేస్తే ఒక రోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోల్పోతారన్నారు. నాయకులను జైల్లో పెట్టి నిర్బంధించవచ్చని, యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రద్దు చేయవచ్చని, లక్షలాది రూపాయల జరిమానా విధించవచ్చన్నారు. మరోవైపు ఇప్పటి వరకు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యజమానులకు జైలు శిక్ష పడేదని, దానికి భయపడి కట్టేవారన్నారు. యజమానులు జైలుకెళ్తే బెయిల్ రావాలంటే 50 శాతం చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ లేబర్ కోడ్‌లో యజమానుకు ఈ శిక్షలు ఎత్తివేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణబాబు, సురేష్, మంగయ్య నాయుడు, సిటు గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభ రాజు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

యుకో బ్యాంక్ సీనియర్ ఖాతాదారులకు సత్కారం



ఖాతాదారులను సత్కరిస్తున్న యుకో బ్యాంక్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: యుకో బ్యాంక్ ఉక్కునగరం శాఖలోని సీనియర్ ఖాతాదారులను బ్యాంక్ అధికారులు సత్కరించారు. బ్యాంక్‌లో 40 ఏళ్లుగా శాలరీ అకౌంట్ కలిగిన 50 మంది ఖాతాదారులను బ్యాంక్ యాజమాన్యం గుర్తించింది. ఆదివారం బ్యాంక్ శాఖలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యుకో బ్యాంక్ ఆంధ్రా రీజియన్ ఇంటిగ్రేటెడ్ లోన్ హబ్ హెడ్ సుదీప్తి మిశ్రా చేతుల మీదుగా ఖాతాదారులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ తెలుగు రాష్ట్రాల జోనల్ మేనేజర్ ఎన్. శ్రీకాంత్, మేనేజర్ సతీష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ అధికారులు సవ్యసాయి పాణి, సోమయాజులు పాల్గొన్నారు.

ప్రసన్న కుమార్‌కు ఉత్తమ నటుడి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ప్రసన్నకుమార్

గాజువాక: గాజువాకకు చెందిన నటుడు ఐనవోలు ప్రసన్నకుమార్‌కు ఉత్తమ నటుడు అవార్డు లభించింది. తన స్వీయ దర్శకత్వంలో నిర్మించి, నటించిన మరో అడుగు మార్పు కోసం చిత్రానికి ఈ అవార్డు సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన టాలీవుడ్ అవార్డ్స్ కార్యక్రమంలో దర్శకులు సముద్ర, ముప్పలేని శివ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. తన చిత్రానికి ఇప్పటికే దాసరి ఎక్స్‌లెన్షన్, కోడి రామకృష్ణ కళారత్న అవార్డు, భారత్ కళారత్న అవార్డుతో పాటు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏపీ రిపబ్లిక్ డే అవార్డులు వచ్చాయని ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న రాగం కిషోర్

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని వైజాగ్ సీ-పోర్ట్ వైస్ చైర్మన్, పినాకిల్ ఎండీ రాగం కిషోర్ పేర్కొన్నారు. జ్ఞానాపురం పరిధిలో రంజిత్ కుమార్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత డాక్టర్ దాసరి బుజ్జి నేతృత్వంలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరికి ఒక మొక్క అనే నినాదంతో మొక్కలు అందజేశారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాపాక యాదవ్, కొయిలాడ శ్రీనివాసరావు, సుభాషిణి, పద్మ, భవిత, ఉమా, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక..చల్లగ చూడమ్మా



కలశాలను ఊరేగిస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని కొత్త కర్నవానిపాలెం గ్రామ దేవత నూకాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకొని ఆదివారం కలశాలను ఊరేగించారు. కొత్త కర్నవాపాలెం గ్రామం నుంచి సమతానగర్ మీదుగా నడుపూరు వరకూ పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ఆ నీటితో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టీల్ డీఐటీయూ ప్రధాన కార్యదర్శి డేవిడ్‌కు సత్కారం



డేవిడ్ దంపతులను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి. డేవిడ్‌ను ఘనంగా సత్కరించారు. డేవిడ్ ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా డీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డేవిడ్ దంపతులను ఉక్కు అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎం. మధుసూదనరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆయన సేవలను ప్రశంసించారు. వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, పి.వి. రమణమూర్తి, గంధం వెంకటరావు, దొమ్మేటి అప్పారావు, శశిభూషణరావు, రామ్మోహన్‌కుమార్, జగదీష్, నమ్మి సింహాద్రి, బయ్యే మల్లయ్య, అప్పారావు పాల్గొన్నారు.

పరిహారంలో జాప్యంపై ఉక్కు యాజమాన్యానికి నోటీసులు

అగనంపూడి: ఉక్కు కర్మాగారంలో మృతిచెందిన కార్మికుల ఆధారిత కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ విషయంలో యాజమాన్యం వైఖరి తెలపాలని సూచిస్తూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నోటీసులు జారీ చేశారు. ఉక్కులో విధులు నిర్వహిస్తూ 2016లో ఎస్.ఎ.రామచంద్రరావు, 2019లో గొడ్డి అప్పారావు మృతిచెందారని వారి కుటుంబ సభ్యులు సీతిన లక్ష్మి, గొడ్డు నాగమ్మలు తెలిపారు. విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబ ఆధారిత సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం జరపాల్సి ఉండగా పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీనిపై స.హ.చ కార్యకర్త పట్టా రామ అప్పారావు ద్వారా వివరాలు కోరగా నిరాకరించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఉక్కు యాజమాన్య ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన రాంబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారిలో ఆదివారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన కర్రి రాంబాబు (38) బైక్‌పై స్టీల్‌ప్లాంట్ వైపు వెళ్తున్నాడు. శ్రీచైతన్య జూనియర్ కళాశాల సమీపంలోకి వచ్చే సరికి కారు ఢీకొనడంతో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన పోలీసులు వెంటనే అతన్ని కూర్మన్నపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రాంబాబు చికిత్స పొందుతున్నాడు. బైక్‌ను ఢీకొన్న కారును అదుపులోకి తీసుకుని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.